క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. వైదిక ధర్మం, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): జీవితంలో విద్యార్థి దశ మరుపురానిదని, స్నేహితుల మధ్య ఏర్పడే అనుభూతులతో పాటు సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య బంధాలు బలంగా ఉండాలని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. ఆదివారం మెడికల్ కాలేజీలోని యూజీ హాస్టల్‌లో నిర్వహించిన ఫ్రెండ్‌షిప్ డే కార్యక్రమానికి ఆమె హాజరై స్నేహం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు హాస్టల్‌లో మొక్కలు నాటి పరిసరాలు శుభ్రం చేశారు. వార్డెన్ డాక్టర్ నాగేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ డాక్టర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాలయంలో జేసీ పూజలు



జేసీ బి.నవ్యను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని సూర్యనారాయణ స్వామికి జేసీ, కుటుంబసభ్యులు విశేష పూజలు, అర్చనలు చేశారు. మహాగౌరీ దేవి, గౌరీ శంకరుడు, దత్తాత్రేయ స్వామి మూర్తులను దర్శించుకున్నారు. గోపూజ చేసి గోవులకు గ్రాసం అందజేశారు. ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ టీఎస్ రామకృష్ణ, అర్చకులు జేసీకి జ్ఞాపికను అందజేసి సన్మానించారు.


హరిత హోటల్‌ను సందర్శించిన ఈడీ



ఈడీ పద్మావతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీటీడీసీ ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం వీఆర్ కాలనీలో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని హరిత హోటల్‌ను ఏపీటీడీసీ అడ్మిన్ ఈడీ ఎ.ఎల్.పద్మావతి ఆదివారం సందర్శించారు. పున్నమి రెస్టారెంట్‌లో జరుగుతున్న రెనోవేషన్ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏపీటీడీసీ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం కర్నూలు డివిజన్ కార్యదర్శి వై.రాజశేఖర్, సభ్యులు జాషువా, ఈశ్వర్, సుధాకర్, మధు, సురేష్. నరసింహారావు ఈడీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు, నేర చరిత్ర గల వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

కీళ్లలో కిరికిరి

- కర్నూలులోని గణేష్‌నగర్‌కు చెందిన శ్రీనివాసులు బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కిందపడ్డాడు. కాలి ఎముక విరిగింది. ఆపరేషన్ అనంతరం నాలుగు నెలలకు పైగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పటికీ సరిగ్గా నడవలేని పరిస్థితి.
- కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన గణేష్ ఫోన్ మాట్లాడుతూ రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మెట్లు దిగుతుండగా అదుపు కింద పడ్డాడు. మోకాలి వద్ద ఎముక విరిగింది. ఆసుపత్రికి తీసుకెళ్లగా ఫ్రాక్చర్ అయినట్లు నిర్ధారించి ఆపరేషన్ చేశారు. ఆరు నెలల తర్వాతే అతను మామూలుగా నడవగలుగుతున్నాడు.

- పెరుగుతున్న కీళ్లు, ఎముకల సమస్యలు
- ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మందికి పైగా బాధితులు
- నివారణకు వ్యాయామం, సమతుల ఆహారం తప్పనిసరి
- నేడు జాతీయ ఎముకలు, కీళ్ల దినోత్సవం



ఎముకల బలహీనతను చూపే చిత్రం

మారిన జీవనశైలి కారణంగా చాలా మందిలో ఎముకలు మెత్తబడుతున్నాయి. చిన్నపాటి ప్రమాదాలకే విరుగుతున్నాయి. దీంతో నెలల తరబడి ఇంటికే పరిమితం కావాల్సి వస్తోంది. ఆరోగ్యపరంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కీళ్లు, ఎముకల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 4న జాతీయ ఎముకలు, కీళ్ల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో 5 శాతం ఉన్న వీరి సంఖ్య ప్రస్తుతం ఏడు శాతానికి పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 3 లక్షలకు పైగా ప్రజలు కీళ్లు, ఎముకల వ్యాధులతో బాధపడుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. యాంత్రీకరణ పెరగడంతో శారీరక శ్రమ, ఎండలో గడపడం తగ్గిపోయింది. దీంతో ఒంట్లో కాల్షియం, విటమిన్–డి మినరల్స్ తగ్గిపోతున్నాయి. ఈ కారణంగా మోకాళ్ల నొప్పులు వస్తుండటంతో బాధితులు నొప్పుల మాత్రలు, కాల్షియం మాత్రలకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

కిడ్నీలను దెబ్బతీస్తున్న నొప్పుల మాత్రలు

మోకాళ్ల నొప్పులు తగ్గించుకునేందుకు గ్రామీణ, పట్టణాల్లోని మురికి వాడల్లో ప్రజలు ఆర్‌ఎంపీలు, నకిలీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. వీరు నొప్పులను తగ్గించేందుకు ఒక స్టెరాయిడ్, మరో పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్లు వేస్తున్నారు. అలాగు నొప్పుల మాత్రలు ఇస్తున్నారు. దీర్ఘకాలం నొప్పుల మాత్రలు వాడటం వల్ల చాలా మందికి కిడ్నీలు దెబ్బతింటున్నాయి. దీంతో కిడ్నీ వ్యాధులను తగ్గించుకునేందుకు నెఫ్రాలజిస్టుల వద్దకు, అక్కడినుంచి డయాలసిస్ చేయించుకోవడానికి వెళ్తున్నారు. ఈ కారణంగా డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు కిడ్నీ వ్యాధులు, కీళ్ల నొప్పులు తగ్గిస్తామని చెబుతూ నకిలీ వైద్యులు చలామణి అవుతున్నారు. ఆయుర్వేదం, అల్లోపతిలోని పెయిన్ కిల్లర్, స్టెరాయిడ్ మాత్రలను పొడిచేసి కలిపి మాత్రలు తయారు చేసి రోగులకు ఇస్తున్నారు. వీటిని వేసుకుంటే ఉపశమనం ఇస్తుండటంతో ఈ మందులు బాగా పనిచేస్తున్నాయని నమ్మి బాధితులు వాటినే నిరంతరం వాడుతూ కిడ్నీలను దెబ్బతీసుకుంటున్నారు.

కీళ్లవాతం అడుగు వేయనీయదు

జీవనశైలిలో మార్పుల కారణంగా కీళ్లవాతం (రుమటాయిడ్ ఆర్థరైటిస్)తో బాధపడే వారి సంఖ్య కూడా పెరిగింది. చికిత్స చేసేందుకు జిల్లాలోనే రుమటాలజిస్టులు ఉన్నారు. కొందరు జనరల్ ఫిజీషియన్లు సైతం రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు చికిత్స అందిస్తున్నారు. వ్యాధినిరోధక వ్యవస్థ వ్యతిరేక దిశలో పనిచేయడం వల్ల సంభవించే ఈ వ్యాధిలో కీళ్లలో నొప్పి, వాపు, బిగువు లక్షణాలు ఉంటాయి. సాధారణంగా చెయ్యి, పాదం, మణికట్టు, మోచేయి, చీలమండలంలోని చిన్న కీళ్లను ప్రభావితం చేస్తుంది. దీనికి స్త్రీ, పురుష అన్న భేదం లేదు.

ఇలా చేస్తే మేలు...

కీళ్లనొప్పులున్న వారు ఎక్కువగా సమతులాహారం తీసుకోవాలి. ఎముక ఆరోగ్యానికి క్యాల్షియం, ప్రొటీన్లు కలిగిన ఆహారం తినాలి. వైద్యుల సూచన మేరకు నిర్ణీత కాలం పాటు కాల్షియం, విటమిన్–డి మాత్రలు వాడాలి. బీపీ, షుగర్, అధిక బరువు ఉంటే వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. కండరాలు, ఎముకల బలోపేతానికి తప్పనిసరిగా వ్యాయామం చేయాలి.

కీళ్ల నొప్పులతో వ్యాపారం

ప్రస్తుతం 40–50 ఏళ్లు దాటిన వారిలో బీపీ, షుగర్‌తో పాటు ప్రధాన సమస్య కీళ్లనొప్పులే. వైద్య పరిభాషలో ఆస్టియో ఆర్థరైటిస్‌గా పిలిచే ఈ వ్యాధి కొందరు వైద్యులను పెంచి పోషిస్తోంది. కీళ్లనొప్పులపైనే ప్రతి నెలా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో అవసరం లేకపోయినా కీళ్లమార్పిడి ఆపరేషన్లు చేసే వైద్యులూ పెరిగారు. చివరి దశలోనే కీళ్ల మార్పిడి చేయాల్సి ఉన్నా రెండు, మూడు దశల్లోనూ ఆపరేషన్ చేస్తున్నారు. ఒక్కో మోకాలికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఆపరేషన్ అనంతరం మరో నెలరోజుల పాటు ఫిజియోథెరపి, మందుల పేరుతో మరో రూ.20 వేల దాకా ఖర్చవుతోంది. మరికొందరు ఆహారానికి బదులు కాల్షియం, విటమిన్–డి, ఇతర ఎముకలకు సంబంధించిన సప్లిమెంట్లు ఎక్కువ సంఖ్యలో రాస్తూ రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు.

ఆస్టియోపోరోసిస్ వ్యాధులు ఎక్కువయ్యాయి



ఇటీవల కాలంలో కీళ్లు, ఎముకల నొప్పులతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. ఒకేచోట కదలకుండా కూర్చుని పనిచేయడం, ఎండ తగలకపోవడం, తద్వారా స్థూలకాయం, మారిన ఆహారపు అలవాట్ల కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయి. ముఖ్యంగా మగవారి కంటే స్త్రీలలోనే ఎక్కువగా ఇవి కనిపిస్తున్నాయి. దానికి కారణం మెనోపాజ్ తర్వాత ఎముకలు బలహీనపడుతున్నాయి. ఈ సమయంలో వారు క్యాల్షియం, విటమిన్–డి సప్లిమెంట్లు తప్పనిసరిగా వాడాలి. ఆహారంలో ఒక గ్లాసు పాలు తప్పనిసరిగా తీసుకోవాలి.

– ఎం.రాజేష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్, కర్నూలు

నొప్పుల మాత్రలు ఎక్కువగా వాడకూడదు



కీళ్లనొప్పులతో బాధపడే వారు ఎక్కువగా నొప్పుల మాత్రలు వాడుతున్నారు. వైద్యులు రాయకపోయినా ఆర్‌ఎంపీల ఇచ్చాడనో, మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి వాడుతున్నారు. దీర్ఘకాలం ఇలా వాడటం వల్ల కిడ్నీలు దెబ్బతింటాయి. అలా గాకుండా వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ ఫిజియోథెరపీ సలహాతో వ్యాయామం చేస్తే నొప్పులు క్రమంగా తగ్గుముఖం పడతాయి.

– డాక్టర్ విజయకృష్ణారెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్, కర్నూలు

15న లేబర్ ఆఫీసు ముట్టడికి పిలుపు



మాట్లాడుతున్న ఆర్.నరసింహులు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం ఈనెల 15వ తేదీన విజయవాడలో లేబర్ ఆఫీసు ముట్టడిని విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ సుధాకరప్ప పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యనారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అధికారంలోకి రాక మునుపు సీఎం చంద్రబాబునాయుడు భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా కార్మికులకు ఇచ్చిన మాటపై నిలవడం లేదన్నారు. ఫలితంగా విజయవాడలో లేబర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసులు మద్దిలేటి, శేషన్న, రాము, రాజు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రేపు ఆందోళనలు

- స్మార్ట్‌మీటర్లు పెడితే పగలగొట్టండన్న లోకేష్ ఇప్పుడు మాట్లాడకపోవడం విడ్డూరం

కర్నూలు(సెంట్రల్): స్మార్ట్ మీటర్లు, పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఆగస్టు 5న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టే విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళనలను విజయవంతం చేయాలని సీపీఎం న్యూసిటీ కమిటీ సభ్యులు టి.రాముడు, సాయిబాబా, ఆర్.నరసింహులు, కె.సుధాకర్, వై.నగేష్ పిలుపునిచ్చారు. అధికారంలోలేని సమయంలో ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లను పెడితే పగలగొట్టాలని చెప్పిన మంత్రి నారా లోకేష్ ఇప్పుడెందుకూ నోరు మెదపడం లేదని వారు ప్రశ్నించారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అధికారంలో లేని సమయంలో చంద్రబాబు, లోకేష్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ఆదేశించారని, వారు అధికారంలోకి రాగానే మళ్లీ వాటిని అమలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పటికే రూ.19 వేల కోట్ల భారాలను ప్రజలపై వేశారని, మళ్లీ మరో రూ.12 వేల కోట్ల భారాలను మోపేందుకు కూటమి సర్కార్ సిద్ధమవుతుండడం సిగ్గుచేటన్నారు. నాయకులు కె.గోవిందు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న సీపీఎం నాయకులు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కల్లూరు ఎస్టేట్‌లోని కరెంట్ ఆఫీసు సమీపంలో డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. 32వ వార్డుకు చెందిన ప్రజలు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాలు చేసినట్లు సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు సుధాకరప్ప, వై.సుధాకర్, డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్, సురేష్, రాజు. మునిస్వామి, రామానాగిరెడ్డి, వీరస్వామి, బషీర్ అహ్మద్, నజీర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. ఆదివారం రాత్రి నగరంలో చేపడుతున్న స్వచ్ఛత పనులను కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా పూలబజార్, పాత ఈద్గా, బళ్లారి చౌరస్తా ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రధాన రహదారుల్లో రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు స్వచ్ఛత పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. వంద మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించి ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, నాగరాజు, మునిస్వామి జిలానీ, వలీ పాల్గొన్నారు.



పూలబజార్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

వీహెచ్‌పీ జిల్లా సమావేశం

కల్లూరు: స్థానిక ఆదిత్య హైస్కూల్లో ఆదివారం విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ భారత్ సంకల్ప దివస్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య వక్త దక్షిణాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకటరామయ్య కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లాలో పెద్దఎత్తున కార్యకర్తల సమక్షంలో సంకల్ప దివస్ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరాజులు మాట్లాడుతూ.. హైందవ శంఖారావం సభలో శ్రీ చిన్నజీయర్ స్వామి ఆలయాల విముక్తి కొరకై ప్రతిజ్ఞ చేయించిన డిక్లరేషన్‌ను జిల్లా సమావేశంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీసీ మద్దిలేటి, వాసుదేవయ్య, గోరంట్ల రమణ, స్వాత్మానంద స్వామి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఆయన వివరించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్

పీజీఆర్‌ఎస్‌లో సమర్పించిన అర్జీలు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నేడు నగరపాలకలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు ఏవైనా సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

బీఎల్‌ఓలకు గౌరవ వేతనం రెట్టింపు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు గౌరవ వేతనాన్ని పెంచుతూ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బీఎల్‌ఓలు (బూత్ లెవల్ ఆఫీసర్), బీఎల్‌ఓ సూపర్‌వైజర్లకు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చేవారు. ప్రస్తుతం ఈఆర్‌ఓలు (ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్), ఏఈఆర్‌ఓలకు కూడా గౌరవ వేతనం నిర్ధారించింది. 2015 నుంచి బూత్ లెవల్ ఆఫీసర్లకు ఏడాదికి రూ.6 వేల గౌరవ వేతనాన్ని ఇస్తూ వస్తున్నారు. ప్రస్తుతం దానిని రెట్టింపు అంటే రూ.12 వేలు చేశారు. అలాగే ఎలక్ట్రోరోల్ సమయంలో ఇచ్చే ఇన్సెంటివ్‌ను రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు పెంచారు. ఇక బూత్ లెవల్ ఆఫీసర్ సూపర్ వైజర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని కూడా రూ.12 వేల నుంచి రూ.18 వేలకు పెంచారు. ఇక గతంలో ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలకు ఎలాంటి గౌరవ వేతనం ఇచ్చేవారు కాదు. ఇక నుంచి ఏఈఆర్‌ఓలకు రూ.25 వేలు, ఈఆర్‌ఓలకు రూ.30 వేలు ఇస్తారు. కాగా, బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు ఇచ్చే గౌరవ వేతనాన్ని నాలుగు త్రైమాసికల్లో చెల్లిస్తారు.

7న కుర్ని సంఘం మహాసభ

వెల్దుర్తి: ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కోడుమూరులో రాష్ట్ర కుర్ని(నేసె) సంక్షేమ సంఘం ప్రథమ మహాసభ నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోట్ల ఓమేంద్ర బాబు, కోశాధికారి కామార్తి హనుమంతప్ప, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక సంఘం ప్రతినిధులతో కలిసి మహాసభకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. కులస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోట్ల రుషేంద్ర బాబు, మండల ప్రతినిధులు గోట్ల శివ, ఎల్లయ్య, రవి, శేఖర్ పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ



ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): అవయవదానం వల్ల కొన్ని కుటుంబాల్లో వెలుగు నింపవచ్చని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. 15వ జాతీయ అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని అంగ్‌దాన్ జీవన్ సంజీవని అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వైద్య విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అవయవదానం కోసం ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్టర్ చేసుకుని ముందుకు రావాలన్నారు. మనిషి మరణించిన తర్వాత అతని అవయవాలను అవసరమైన వారికి అమరిస్తే పునర్జన్మ ప్రసాదించినట్లు అవుతుందన్నారు. ఓ వ్యక్తి నుంచి అవయవాలు సేకరించడం వల్ల 8 మంది జీవితాల్లో వెలుగు నింపవచ్చని చెప్పారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, వైద్యాధికారులు ముత్యశ్రీ, వెంకట పక్కిరెడ్డి, శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్, సునీల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉత్తర్వులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పాఠశాలల్లోకి రాజకీయ నాయకులు, విద్యార్థి సంఘాలు వెళ్లరాదని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, ఎస్.షాబీర్‌బాషా మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తున్నామని, తక్షణమే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల కోసం పోరాడేందుకు పాఠశాలల్లోకి వెళ్తుంటారన్నారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం అన్యాయమన్నారు. దీనిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. ప్రధానంగా చైతన్య, నారాయణ, భాష్యం విద్యాసంస్థలు కూటమి నేతలకు చెందినవి కావడంతో వాటిలో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తున్నారని, వారిని ప్రశ్నించేందుకు ఎవరూ వెళ్లకూడదన్న నిర్ణయంతో ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, అభిరామ్, దీపిక, రియా, మధు, బన్నీ పాల్గొన్నారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి

కర్నూలు (టౌన్): అనధికార లే ఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సంబంధించి కొన్ని సవరణలు చేస్తూ ప్రభుత్వం జీఓ 134 జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 30కి ముందు ఏర్పాటైన అనధికార లేఔట్లు, ప్లాట్ల ను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకు అక్టోబర్ 24వ తేదీలోపు రూ.10 వేలు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్పొరేషన్ సిబ్బంది తనిఖీ చేసి ధ్రువీకరించిన తర్వాత మార్కెట్ విలువలో 14 శాతం అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. 45 రోజుల్లోపు పూర్తి రుసుం చెల్లించిన వారికి 10 శాతం రాయితీ, 45 నుంచి 90 రోజుల వ్యవధిలో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. గడువులోపు క్రమబద్ధీకరించుకోని అనధికార లేఔట్లు, ప్లాట్లకు విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి సదుపాయాలకు అనుమతి ఉండదని వెల్లడించారు. వివరాలకు నగరపాలక కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించాలని లేదా 77807 15803 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రెడాయ్ సామాజిక బాధ్యత అభినందనీయం

కర్నూలు (టౌన్): కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) సామాజిక బాధ్యతగా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. ఆదివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో.. పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలను క్రెడాయ్ సంస్థకు బదలాయింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేశారు. కమిషనర్, క్రెడాయ్ సంస్థ జిల్లా చైర్మన్ గోరంట్ల రమణ ఎంఓయూలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాతబస్తీలో దశాబ్దాల చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రికి పూర్వ వైభవం తెచ్చేందుకు స్వచ్ఛందంగా, సామాజిక బాధ్యతగా క్రెడాయ్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. క్రెడాయ్ సంస్థ జిల్లా చైర్మన్ మాట్లాడుతూ.. ముందుగా రూ.20 లక్షలతో ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, క్రెడాయ్ సభ్యులు పాల్గొన్నారు.



ఎంఓయూలపై సంతకాలు చేస్తున్న కమిషనర్, క్రెడాయ్ సంస్థ సభ్యులు

రహ'దారి'ద్ర్యం





జొహరాపురం - వెంకయపల్లె రోడ్డు దుస్థితి

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యాలు గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోడ్లవి కాదు. నగర పరిధిలోని జొహరాపురం రోడ్డు దుస్థితి ఇదీ. కర్నూలు నగరంలోని జొహరాపురం నుంచి వెంకాయపల్లె, పుల్లయ్య కళాశాలతో పాటు వివిధ కాలనీలకు చెందిన వారు నిత్యం ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఎదురుగా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని, అలాగే రోడ్డు ఎత్తులో ఉండడంతో సైడ్లకు కంచె నిర్మించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

– కల్లూరు

రేపు భవిష్యవాణి

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో శ్రీ సద్గురు హొసిగేరప్పతాత వారి శ్రావణ శుద్ధ దశమి ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో భవిష్యవాణి కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులు ఆదివారం తెలిపారు.